క్లుప్తంగా

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన


జ్యోతిర్లింగాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

గోరంట్ల: స్థానిక మాధవరాయ దేవాలయ ప్రాంగణంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ సరోబాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు పోతురామకృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి పూజలు చేసి జ్యోతిర్లింగాల ప్రదర్శనను ప్రారంభించారు. బ్రహ్మకుమారి రజని కుమారి మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలను శివరాత్రి రోజు దర్శించుకుంటే మహా భాగ్యం కలుగుతుందన్నారు. ఆర్య వైశ్య సంఘం నాయకులు బలరాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శనిత్రయోదశి పూజలు


విశేష పుష్పాలంకరణలో శనేశ్వరుడు

హిందూపురం: శనిత్రయోదశి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని డీబీకాలనీలో శనివారం శనేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్‌కు విశేషపూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం తిల తైలాభిషేకం చేసి విశేష పుష్పాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం విశేషంగా జేష్టదేవి సమేత శనేశ్వరుని ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. భక్తులు నువ్వులనూనెతో దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు బ్రహ్మరథోత్సవం

లేపాక్షి: మహాశివరాత్రిని పురస్కరించుకొని లేపాక్షిలో ఆదివారం మధ్యాహ్నం 1గంటకు శివపార్వతుల బ్రహ్మరథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. హాజరయ్యే భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

మడకశిర: పట్టణంలోని ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. 20, 21, 22వ తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. బ్రిడ్జ్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు అరగంట ముందే రావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నివారించండి

మడకశిర(అగళి): విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ అగళి మండలంలోని మధూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం రావుడి, కొమరేపల్లి గ్రామ పంచాయతీల రైతులు ధర్నా నిర్వహించారు. నిరంతరంగా పగటిపూటనే 9గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏఈ శ్రీనివాసబాబు మాట్లాడుతూ రామనపల్లిలో రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్నామని, విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


బోరుబావిలోకి పైపులు వదులుతున్న దృశ్యం

అమరాపురం: గుణేహళ్లి గ్రామానికి బోరుబావి ద్వారా నీటిని సరఫరా చేసే మోటర్ కాలిపోయి మరమ్మతులకు గురైంది. పండగపూట నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన సర్పంచ్ తిప్పేస్వామి, కార్యదర్శి నరేష్ మెకానిక్‌లను రప్పించి మోటర్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

మూగజీవాలకు విముక్తి

పావగడ: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న 8 గేదె దూడలను భజరంగదళ్ నాయకులు కాపాడారు. మడకశిర తాలూకా గుడిబండ పశువుల సంతలో 8 గేదె దూడలను కొనుగోలు చేసి వాటిని ఓ వ్యానులో పెనుగొండ కబేళాకు తరలిస్తున్నట్లు సమాచారంతో పావగడ తాలూకా దొమ్మతమరి గ్రామ సమీపంలో భజరంగదళ్ నాయకులు సుమన్, వాసు, గోరక్ష ప్రముఖ్ రాకేశ్, సురక్ష ప్రముఖ్ రవి, హర్షలు అడ్డుకున్నారు. మూగజీవాల తరలింపునకు వైద్య ధృవీకరణపత్రాలు, వాహనానికి లైసెన్స్ లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పశువులను, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

హరహర మహాదేవ..

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. శైవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శివ నామస్మరణతో భక్తులు పరవశించిపోయారు. శివపార్వతుల కల్యాణోత్సవం, విశేష పూజలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. కుంభాభిషేకం, మహారుద్రాభిషేకం, అంకురార్పణ, హోమం, గణపతి పూజలు నిర్వహించారు. మామిడి తోరణాలు, అరటి పిలకలు, పూలతో పాటు విద్యుత్ దీపాలతో ఆలయాలను చూడ ముచ్చటగా అలంకరించారు. రాత్రి జాగరణకు ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

మడకశిర: మడకశిర పట్టణంలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మడకశిర కొండపై వెలసిన రామలింగేశ్వర, వీరభద్ర, బసవేశ్వర, నగరేశ్వర, భోగిరామేశ్వర, మల్లేశ్వర, స్వయం భువనేశ్వర, ఓంకారేశ్వర, దత్తబాణలింగేశ్వర, శంకరలింగేశ్వర ఆలయాల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిలమత్తూరు: కొడికొండ పంచనందీశ్వరాలయంలో స్వామి వారికి అభిషేకార్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డెప్ప, కదిరి అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కనుమలోని శివాలయం, బ్రహ్మేశ్వరంపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమరాపురం: విరుపసముద్రం, తమ్మడేపల్లి, అమరాపురం, హలుకూరు, వలస, హేమావతి తదితర గ్రామాల్లోని ఈశ్వరాలయాల్లో శివలింగాలను బిల్వ, జమ్మి ఆకులతో అలంకరించి పూజలు చేశారు.

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున కొలువైన పురాతన రుద్రపాద శివాలయంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

రొళ్ల: టీడీ పల్లి సిద్దేశ్వరస్వామి, కాకి మల్లేశ్వర స్వామి, ఎం.రాయాపురం చంద్రమౌళేశ్వరస్వామి, రొళ్లకొండ ఈశ్వర, కొడగార్లగుట్ట, కె.బ్యాడిగెర గ్రామాల్లోని బసవేశ్వరస్వామి, రత్నగిరి కాళికాంబ కమటేశ్వరస్వామి, చెన్నమల్లికార్జునస్వామి, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

పరిగి: పరిగి, కొడిగెనహళ్లి, సంగమేశ్వంపల్లి వద్ద వెలసిన శ్రీసంగమేశ్వర ఆలయం, శాసనకోట తదితర పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పరిగి, పైడేటి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిగిలో పార్వతీ సమేత బీరలింగేశ్వర, రేణుకా యల్లమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

మడకశిరరూరల్: భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట అంజినేయస్వామి, నీలకంఠేశ్వర స్వామి, లక్ష్మీనిడిమామిడమ్మ, చౌడేశ్వరిస్వామి, చందకచెర్లు ఆంజినేయస్వామి, వీరకేతమ్మ తదితర ఆలయాల్లో స్వామివార్లకు పూజలు నిర్వహించారు.

పెనుకొండ: పెనుకొండలోని కాశీ విశ్వేశ్వరాలయం, ఐముక్తేశ్వరాలయం, నగరేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. భోగసముద్రం చెరువులో ప్రతిష్టించిన భారీ శివుని విగ్రహాన్ని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీకైలాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుకొండ: శివరాత్రి వేడుకల్లో భాగంగా బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన శివలింగాలను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ దర్శించుకొని పూజలు చేశారు.


పరిగిలో బీరలింగేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు


పెనుకొండ: భోగసముద్రం చెరువులో శివుడి విగ్రహం వద్ద భక్తుల సందడి



రొళ్ల మండలం కాకి మల్లేశ్వరస్వామికి అలంకరణ , చిలమత్తూరు: కొడికొండ పంచనందీశ్వరుడు


మడకశిర: చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


అమరాపురం: ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి




శివలింగానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, రొద్దం: రుద్రపాద ఆలయం వద్ద పూజలు, చిలమత్తూరు: పార్వతీదేవి మూల విరాట్





శ్రీకంఠపురం ఆలయంలో విశేష అలంకరణ, బసవనపల్లిలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు, పావగడలో శివుని వేషధారణలో మూడు నెలల శిశువు

సర్వం శివమయం

హిందూపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం పట్టణంలోని శివాలయాల్లో అభిషేకాలు, పూజలు ఘనంగా జరిగాయి. త్యాగరాజనగర్‌లోని ఉమానర్మదేశ్వర ఆలయం, మేళాపురంలోని భవానీ శంకర దేవాలయం, గాంధీసర్కిల్‌లో శివాలయం, శ్రీకంఠపురంలోని పాత శివాలయం, సూరప్పకట్ట వద్ద ఉన్న దక్షిణా మూర్తి ఆలయం, కోటా శివాలయంలో గణపతి నవగ్రహ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, మృత్యుంజయ పూజలు నిర్వహించారు. హిందూపురం మండలం బసన్నపల్లిలో మహాశివుడి భారీ విగ్రహం వద్ద మహాన్యాస పూర్వక ఏకాదశరుద్ర, పంచామృతాభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి పూజలు చేశారు. వందలాదిగా ప్రతిష్టించిన శివలింగాలను భక్తులు దర్శించుకున్నారు. రాత్రి శివపార్వతులకు మేళాతాళాలు వేదమంత్రోచ్చారణతో కల్యాణోత్సవం చేసి పల్లకీలో ప్రాకారోత్సవం నిర్వహించారు.

మార్మోగిన శివనామ స్మరణ

పావగడ: ఆధ్యాత్మిక కేంద్రమైన కామలికొండ శివనామ స్మరణతో మార్మోగింది. కామనదుర్గంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బసవరాజప్ప, మల్లికార్జునప్ప, నాగరాజప్పలు రామలింగేశ్వర స్వామికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ సమితి అధ్యక్షుడు మాధవ రెడ్డి, కార్యదర్శి సురేశ్ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కొండపైకి వెళ్తున్న భక్తులు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

లేపాక్షి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం లేపాక్షిలోని వీరభద్ర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితులు శివపార్వతులను అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. శివపార్వతుల కల్యాణ విశిష్టతను ఆగమికులు సునీల్‌శర్మ భక్తులకు వివరించారు. అంతకుముందు ఉదయం అభిషేకార్చనలు, దీపోత్సవం, రుద్రహోమం, వృషభ వాహనోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు దీపాలను వెలిగించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో వీరభద్రస్వామి, దుర్గాదేవి, పాపనాశేశ్వరస్వామి మూలవిరాట్‌లను అలంకరించారు.

అక్రమ మద్యం రవాణాదారుడి అరెస్ట్

గోరంట్ల: బైక్‌కు ప్రెస్ అని రాయించుకొని మద్యం రవాణా చేస్తున్న కరావులపల్లి తండా గ్రామానికి చెందిన బాలకృష్ణనాయక్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పుట్టపర్తి– గోరంట్ల ప్రధాన రహదారిపై శనివారం తనిఖీలు చేస్తుండగా అటుగా వచ్చిన బైక్‌ను తనిఖీ చేయగా కర్ణాటక మద్యం రవాణా వెలుగు చూసిందని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. బైక్ సీజ్ చేసి 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యంతో సీఐ తదితరులు

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో కొలువైన సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నాగేంద్ర ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అఖండ పూజల అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు సర్పంచ్ తిప్పేస్వామి తాగునీటి సౌకర్యం కల్పించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం భానుపల్లకీ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

రేపు అగ్నిగుండ మహోత్సవం

మడకశిర: సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ ఈఓ తెలిపారు. అగ్నిగుండ మహోత్సవాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రారంభిస్తారని తెలిపారు. గురువారం జరిగే బ్రహ్మరథోత్సవానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని, ఈనేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వైవీరావు మృతి కార్మికులకు తీరని లోటు

మడకశిర: హఠాన్మరణం చెందిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీరావుకు కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. శనివారం స్థానిక డిపోలో చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. డిపో ఈయూ అధ్యక్షుడు రఫిక్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కరించడానికి ఆయన ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. వైవీరావు మృతి ఆర్టీసీ కార్మికులకు తీరని లోటని తెలిపారు. నాయకులు బ్రహ్మానందరెడ్డి, హరిప్రసాద్, శ్రీనివాసులు, మహిపాల్,నూరుల్లా, గంగరాజు,మహేశ్, శంకర్ పాల్గొన్నారు.

హిందూపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండులో వైవీరావు చిత్రపటానికి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నారాయణస్వామి, ప్రసాద్ మాట్లాడుతూ వైవీరావు అకాల మరణం విచారకరమన్నారు.


మడకశిర: వైవీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఉల్లాసంగా ఉట్లపరుష

చిలమత్తూరు: తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ఉట్లపరుషను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధర్మకర్త కుమారస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఉట్లపరుష నిర్వహించగా ఉట్లమాను ఎక్కడానికి యువకులు పోటీపడ్డారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.


ఉట్లమానును తిలకిస్తున్న జనం

ఇంటింటికీ వెళ్లి పథకాలు తెలియజేయండి

- సచివాలయ వ్యవస్థతో అవినీతి రహిత పాలన
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

రొద్దం: అవినీతి రహిత పాలన కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మండలంలోని నారనాగేపల్లి, ఎం.కొత్తపల్లి, ఆర్ లోచెర్ల గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు నారనాగేపల్లి సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు లబ్ధిదారులకు అందేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలని కోరారు. సచివాయల వ్యవస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత జగనన్నదే అని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం తపిస్తున్న జగనన్నకు అండగా నిలిచి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లాలని సూచించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి:

ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలనలో జరిగిన అరాచకాలు, అన్యాయాలను ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు.

యువకుడికి ఆర్థిక సాయం

కియా అనుబంధ సంస్థలో విధులు నిర్వహిస్తూ కాలు విరిగి గాయపడిన యువకుడు రఫిక్‌కు ఎమ్మెల్యే శంకరనారాయణ ఆర్థిక సాయం అందించారు. కంపెనీవారితో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. అదేవిధంగా గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న రేషన్ డీలర్ రాగిట మహేశ్వరరెడ్డి భార్యను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవి శేఖర్‌రెడ్డి, రొద్దం, కలిపి సింగిల్‌విండో చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ, ఏ.లక్ష్మీనారాయణ రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గొల్ల నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

పెనుకొండ: వెంకటగిరిపాళ్యంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కురుబ ఎల్లప్ప (42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కురుబ ఎల్లప్ప నూతనంగా ఇంటిని నిర్మిస్తున్నాడు. శనివారం గోడలకు నీరు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటరమణ గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆస్పత్రికి వెళ్లి కురుబ ఎల్లప్ప భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్నివిధాలుగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


ఎల్లప్ప భౌతికకాయానికి నివాళులర్పించి మృతుడి బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ